# తృప్తి

**వి**జయవాడ కనకదుర్గమ్మ దర్శనం చేసుకునొచ్చి ఆలయ ప్రాంగణంలో చతికిల బడ్డాను.

"మీరు.......నువ్వు.......ప్రకాశానివి కదూ?" నా ప్రక్కన కూర్చున్నతను నా మొఖంలోకి చూస్తూ అడిగాడు.

నల్లగా లావుగా నా వయస్సే వున్న అతని వంక తేరపారి చూశాను. అతడి నవ్వు పట్టిచ్చింది.

"ఒరే మాధవా నువ్వా! ఎన్నేళ్ళై పోయిందిరా మనం కలిసి. సిటీలోనే ఉంటున్నావా?"

తన ట్రేడ్ మార్కు నవ్వు నవ్వి "ఉద్యోగం సద్యోగం పెళ్ళాం బిడ్డలూ అంతా అక్కడే. నువ్వెక్కడ సెటిలయ్యావు ? మీ అమ్మగారూ నాన్నగారూ బావున్నారా?" ఆప్యాయంగా ఆరా తీశాడు.

"నాన్నలేరు. అమ్మ తమ్ముడి దగ్గర ఉంటోంది.....వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో జాబ్ చేస్తున్నాను. నాకు ఒకబ్బాయి. నీకు?"

"అమ్మాయిల్లేరా?"

"ఊహూ. ఒక్కరితోనే కట్ చేసేశాం. ఈ రోజుల్లో పిల్లల్ని పెంచడం చదివించడం చాలా కష్టమైన పని. ఖర్చుతో కూడిన పని........"

"అది సరి కాదురా. ప్రతివారికీ ఒక్కమ్మాయి అయినా వుండాలి. వాళ్ళు చూపించే ఆప్యాయత అనురాగం అపురూపమైనవనుకో. ఒక్కమాటలో చెప్పాలంటే మన తల్లి రెండో జన్మే మన కూతురు"

"నెక్స్ట్ జన్మకి గుర్తు పెట్టుకుంటాన్లే గాని నీకెందరు పిల్లలు? అంతా సెటిలైనట్లేనా?"

"ఇద్దరబ్బాయిలూ ఒకమ్మాయి. అమ్మాయి బీ ఎస్సీ నర్సింగ్ పాసై ఉస్మానియాలో చేస్తోంది. పెద్దోడు సాఫ్ట్ వేర్ ఇంజనీర్. చిన్నోడు సెకండియర్ బీటెక్......"

"మా వాడు అమెరికాలో ఉన్నాడు" కించిత్తు గర్వంగా చెప్పేను. ఒక్కరే సంతానమైతే వాళ్ళనెన్ని ఎత్తులకు తీసుకెళ్ళొచ్చో చెప్పాలన్పించింది గాని అది సమయం కాదని ఊరుకున్నాను.

"ఏం పని మీదొచ్చేవేంటి?" అడిగాను.

"వచ్చే ఆదివారం మా అమ్మాయి పెళ్లి. శుభలేఖని అమ్మవారి పాదాల దగ్గర పెడదామనొచ్చాను. పెళ్లికి నువ్వూ మరదలూ తప్పకుండా రావాల్రా.......ఎడ్రస్సు గుర్తుందిగా. మలక్‌పేటలో అదే ఇంట్లో ఉంటున్నాం. నీ ఫోన్ నెంబర్ చెప్పు"

చెప్పి, సందేహంగా చూస్తూ "ఇప్పుడు ముహూర్తాలున్నాయా?" అడిగాను.

"మాటా మనస్సూ మంచివైతే అంతా మంచిదే" నవ్వేడు.

యమాశ్చర్యంగా చూశాను. "కాలేజీ రోజుల్లో వీర హిందువుని అంటూ తొడగొట్టి మీసం మెలి తిప్పేవాడివి గుర్తుందా? అప్పుడప్పుడూ మీ సంఘ మీటింగులకి బలవంతాన నన్ను కూడా లాక్కుపోయేవాడివి. అలాటి వాడినోట ఇలాటి మాటలు......!"

మందహాసం చేశాడు. "అది సెలయేరు లాంటి యౌవనం. ఇది నిశ్చల నది లాంటి నడివయస్సు"

"చాలా మారిపోయావురా"

తన ప్రత్యేకమైన నవ్వు నవ్వి లేచాడు. షేక్ హేండిస్తూ "మా అమ్మాయి పెళ్లికి మీరిద్దరూ వస్తున్నారు" అన్నాడు.

"ప్రక్క ప్రక్క ఇళ్ళల్లో పదేళ్ళు కలిసి ఉన్నాం. ఎందుకురాను చెప్పు? రేపే ట్రెయిన్‌కి రిజర్వేషన్ చేయించుకుంటాను"

"చాలా సంతోషంగా ఉందిరా. నిన్ను మళ్ళీ కలుస్తాననుకోలేదు. అంతా దుర్గమ్మ తల్లి దయ!" గుడివైపు తిరిగి కళ్ళు మూసుకుని దండం పెట్టుకున్నాడు.

వీడి భక్తి బాగా ముదిరినట్టుంది. అప్పట్లో 'తెలుగునాట భక్తి రసం తెప్పలుగా పారుతోంది, డ్రైనేజు స్కీములేక దేంజరుగా మారుతోంది' అంటూ ఏడిపించేవాడ్ని. అన్నట్టు ఆ కవిత రాసిన కవీ తర్వాత్తర్వాత భక్తిమార్గంలో పడినట్టున్నాడు కదూ!'

ఉత్తినే ప్రామిస్ చేశానుగాని మాధవ కూతురి పెళ్లికి వెళ్ళాలనే ఆలోచనేమీ చెయ్యలేదు. అప్పుడెప్పుడో కలిసి ఉన్నాం. చదువుకున్నాం. మధ్యలో పాతికేళ్ళ గ్యాప్. ఇప్పుడు మళ్ళీ ఆ అనుబంధాన్ని పురిద్దరించుకోవడానికి హైదరాబాదెళ్ళడం శుద్ధ దండుగ!

కాని అనుకోకుండా ఆఫీసు పని మీద సిటీకొచ్చాను. పని త్వరగా తెమిలిపోవడంతో మాధవని కలిసి వద్దామని బయల్దేరాను. పెళ్లిరోజున వేరే అర్జంటు పనుందని ఓ అబద్ధమాడి ముందుగానే శుభాకాంక్షలు చెప్పేస్తే ఓ పనైపోతుంది కదా!

అదే ప్రాంతం. అదే వీధి. కాని గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. చిన్న ఇళ్ళస్థానే మేడలూ ఎపార్ట్‌మెంట్లూ లేచాయి. ఒకప్పటి స్లీపింగ్ ఏరియా ఇప్పుడు షాపుల్తో జనంతో బిజీగా వుంది.

మాధవా వాళ్ళింటి ముందుండే పెద్ద తురాయి చెట్టుని బట్టి వాళ్ళిల్లు గుర్తు పట్టాను. పాత ఇంటిని పడగొట్టి రెండతస్తుల బిల్డింగ్ కట్టాడు. ముచ్చటగా ఉంది. ముగ్గురు పిల్లలున్నా ఇలాటిది కట్టాడంటే రెండు చేతులా సంపాదిస్తున్నాడన్నమాట. ఇవాళరేపు పైజీతం లేకపోతే ఎవడు మాత్రం ఆస్తులు కూడబెట్టగలడూ! ప్చ్. నాదే పైపాటుకాస్కారం లేని ఉద్యోగమై పోయింది!

నాకు తెలీకుండానే నిట్టూర్చాను.

ఇల్లు పడగొట్టినా తురాయి చెట్టుని మాత్రం అలాగే వుంచేశాడు. అదో పిచ్చి!

తలుపులు తెరచి ఉన్నాయి. కాలింగ్ బెల్ స్విచ్‌కోసం తడుముతూనే లోపలికి చూశాను.

ఒకమ్మాయి నమాజు చేసుకొంటోంది.

అదిరిపడి ప్రహరీగోడ బయటికొచ్చి నేమ్ ప్లేట్ వంక చూశాను. 'లక్ష్మీమాధవ'. సందేహం లేదు ఇది మాధవ ఇల్లే. మరి ఆ అమ్మాయి.......పనిమనిషేమో! అంతే అయ్యుంటుంది. ముస్లింల పొడ గిట్టని మాధవ పనమ్మాయిగానైనా ఆ మతస్తురాలిని పెట్టుకుంటాడా? అసంభవం!

"ఎంతసేపయ్యింది వచ్చి? ఇంటిముందే తచ్చాడుతున్నావేంటి?" బయట్నుంచి వస్తూనే అడిగాడు మాధవ.

"ఇంతక్రితమే......"

స్కూటర్ని బయట పార్కు చేసి ఆప్యాయంగా నా భుజం మీద చెయ్యేసి లోపలికి తీసుకెళ్ళాడు.

"పెళ్లికి మూడ్రోజులు ముందే వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందిరా ప్రకాశం. ఫ్రెండ్షిప్ అంటే నీదేరా......." పొంగిపోతూ చెబుతోంటే బలవంతాన నవ్వుతూ అనుసరించాను.

"అమ్మాయ్ ఫర్జానా.....అంకులమ్మా. ప్రకాశం అని నా చిన్నప్పటి దోస్తు. మనింటి ప్రక్కనే అద్దెకుండేవారు. నువ్వు కళ్ళు తెరవకముందే వీళ్ళిక్కడ్నుంచి వెళ్ళిపోయార్లే. మా అమ్మాయిరా. లక్ష్మీదేవిలా లేదూ" గర్వంగా చెప్పేడు.

బొట్టేలేని ఆమె మొఖం వంక అయోమయంగా చూస్తోంటే 'ఆదాం' అంటూ వంగి సలాం చేసింది. లోపలికెళ్తోంటే "అమ్మాజాన్ని రమ్మను......" అన్నాడామెతో.

'కొంపతీసి వీడు ఇస్లాం స్వీకరించాడా ఏమిటి?' అని తలెత్తి చుట్టూ చూశాను. గోడలకు హిందూదేవుళ్ళ ఫోటోలు వ్రేలాడుతూ కన్పించాయి. 'హమ్మయ్య' అని నాకు తెలీకుండానే నిట్టూర్చాను.

మాధవ భార్య వచ్చి రెండు చేతులూ జోడించి నమస్కరించింది. "బావున్నారా అన్నయ్యగారూ. మీ గురించి చెప్పేరు. మీ ఇంటికొచ్చి మేం పిలవకపోయినా మా అమ్మాయి పెళ్లి కొచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది"

"ఇంకా నేను పరిచయం చెయ్యలేదు లక్ష్మీ........." నవ్వేడు మాధవ.

"మాకు పరిచయాలు అవసరంలేదుగాని మీరిద్దరూ పార్వతీపరమేశ్వరుల్లా ఉన్నారు. వీడు శుభలేఖ పంపినా మీ పెళ్లికి రాలేకపోయాను. ఇప్పుడు శుభలేఖ అవసరం లేకుండానే వచ్చేశాను" గొప్పగా చెప్పేను.

ఫర్జానా ట్రేలో మంచినీళ్ళ గ్లాసులు పెట్టుకునొచ్చి మా ఇద్దరికీ ఇచ్చింది.

ఆమె నఖ శిఖపర్యంతం పరీక్షగా చూశాను. నూటికి నూరుపాళ్ళూ ముస్లిం బాలికే. ఒక వీర హిందువు ఇంట.....ఎయిత్ వండరే!

దీని వెనుక ఉన్న మతలబు ఏంటో తెలుసుకోవాలని చాలా ఆరాటంగా ఉంది. అదేవిటో తెలుసుకుంటే తప్ప మనస్సు కుదుటపడేట్టు లేదు. కాని మాధవ ఒంటరిగా దొరకటం లేదే ఖర్మ!

మాధవ కొడుకులొచ్చారు. నన్ను ఆప్యాయంగా పలకరించారు. నా ఏకైక కొడుకు కన్నా ఆత్మీయంగా మాట్లాడారు. 'ఎంత చక్కని సంస్కారం నేర్చారు' అనుకోకుండా ఉండలేకపోయాను.

వాళ్ళేదో అడిగారు. ఫర్జానా ఏదో అంది. దెప్పుకున్నారు. అంతలోనే కలిసిపోయారు. నవ్వుకున్నారు.

"బావగారు ఫోన్ చేశారక్కా. బారాత్‌కి గుర్రం మీద కాకుండా వెరైటీగా ఉంటుందని గాడిద మీద వస్తారట" పెద్దవాడన్నాడు. చిన్నవాడు "అది కూడా కుంటి గాడిదంట" అని ముక్తాయింపిచ్చాడు.

వాళ్ళని కొట్టబోయింది. వాళ్ళు పారిపోయారు. తరిమి పట్టుకుంది. ఆ మరుక్షణం ముగ్గురూ ఒకర్ని పట్టుకుని ఒకరు ఒకటే నవ్వులు.

ఆ దృశ్యాన్ని మాధవా అతడి భార్యే కాదు నేను కూడా ముచ్చటగా చూశాను. మురిసిపోయాను.

తృప్తిగా భోంచేశాను. లక్ష్మి కొసరి కొసరి వడ్డిస్తే ఫర్జానా బ్రతిమాలి బామాలి తినిపించింది.

మొఖం చూపించి వెళ్ళిపోదామనుకున్న వాడ్నల్లా ఆ రాత్రికక్కడే వుండిపోయాను.

మేడపైన పక్క వేశాడు. "తెల్లవార్లూ కబుర్లు చెప్పుకుందాం. పైన అయితే ఎవరికీ డిస్టర్బెన్స్ ఉండదు" అన్నాడు మాధవ.

కాస్సేపు ఆ కబురూ ఈ కబురూ అయ్యాక "ఫర్జానా కథేంటి?" అని అడిగేను.

"కథేమీ లేదు మా అమ్మాయి అంతే"

"ఆ సంగతి విజయవాడలోనే చెప్పేవు. చెప్పనివి చెప్పు....నీ కభ్యంతరం లేకపోతేనే"

"అహ అభ్యంతరం అని కాదు అది తవ్వుకోవడం ఎందుకని"

"బోధన కన్నా ఆచరణ ఎన్నో రెట్లు గొప్పదంటారు. అందుకే అసలేం జరిగిందో తెలుసుకోవాలని ఆత్రంగా ఉంది......"

మాధవ గాఢంగా నిట్టూర్చాడు. పిమ్మట మెల్లగా చెప్పడం మొదలెట్టాడు.

"మా పెద్దోడు పుట్టిన పది పదిహేను రోజులకి నగరంలో మతకల్లోలం చెలరేగింది. మత విద్వేషం పడగవిప్పింది. మత మౌఢ్యం కళ్ళకు పొరలు కప్పింది. కొందరు హిందూ ముస్లింలు ఆ గర్భశత్రువుల్లా కత్తులు నూరుకున్నారు. కుత్తుకలు కోసుకున్నారు. దొంగ తనాలు దోపిడీలు మానభంగాలు అగ్నిదహనాలు.........రాజకీయనాయకులు చేసిన ఆ మహాస్వార్థ యజ్ఞంలో ఎందరో అమాయకులు సమిధలయ్యారు. కత్తిపోట్లకు గురైన ఒక ముస్లిం మహిళ మా గుమ్మంలోకొచ్చి కుప్పకూలింది. చప్పుడికి తలుపుతీశాను. ఏడాది బిడ్డని నా కాళ్ళ దగ్గర పడుకోబెట్టి దణ్ణం పెట్టింది. దూరాన గుంపు రావడం చూసి లేవలేక లేచి పారిపోయింది. బిడ్డ వంక వెర్రిగా చూశాను. కాని బిడ్డ నా వంక ఆర్తిగా చూసింది. అర్థింపుగా చూసింది. ఒంటిమీద ఏడాది కూడా లేని బిడ్డని ఇంట్లోకి తీసుకొచ్చి తలుపేసేశాను. పాప ఒక్కసారిగా ఏడుపందుకుంది. నా భార్య చటుక్కున ముందుకొచ్చి బిడ్డని తీసుకుని పాలు పట్టింది......"

"ఐసీ. అలా ఫర్జానా నీ కూతురయ్యిందన్నమాట......."

"వుహు. నీకు తెలుసుగా. నాకు హిందూ మతమంటే వీరాభిమానం. హిందువునై పుట్టినందుకెంతో గర్వించేవాణ్ణి. బల్లగుద్ది మరీ ఉపన్యాసాలిచ్చేవాడ్ని. ఓ ముస్లిం అమ్మాయిని పెంచడం ససేమిరా ఇష్టంలేకపోయింది. పోలీస్ స్టేషన్‌కెళ్ళి జరిగింది చెప్పేను. వాళ్ళ వాళ్ళకి ఇచ్చెయ్యమని కోరాను. బిడ్డ తాలూకు వాళ్ళు వచ్చేవరకూ నా దగ్గరుంచమన్నారు. అయిష్టంగానే అంగీకరించాను. పేపర్లలో ఫోటో సైతం వేయించాను. కానెవ్వరూ ముందుకు రాలేదు. ఇంకేం పాలుపోక సదానంద స్వామీజీ దగ్గరకి తీసుకెళ్ళాను"

"ఆయనేం చేస్తారు ఆయనే ఓ సన్యాసి కదా!" నవ్వేను.

నా మాటలు పట్టించుకోకుండా చెప్పుకుపోయాడు.

"నా మాటల్ని స్వామీజీ శ్రద్ధగా ఆలకించారు. పిమ్మట చిరుదరహాసం చేశారు. 'ఇది నీ మతదీక్షా పరాయణత్వానికి అగ్ని పరీక్ష' అన్నారు. ఉలిక్కిపడ్డాను. ఆయనేం చెప్పారంటే - 'ఏ మతమైనా జనహితమే జన సౌభాగ్యమే మానవ సముద్ధరణే కోరుతుంది. మతాన్ని ఇస్లాంలో 'మఝూభ్' అంటారు. దానర్థం ధర్మపథం అని. నిశ్చలంగా నిర్మలంగా నిస్వార్థంగా ఉండటానికి ప్రయత్నించడమే మతమంటారు స్వామీ వివేకానంద. త్రికరణ శుద్ధిగా ఫలాపేక్ష రహితంగా కర్మ చేయడమే మనిషి కర్తవ్యం అన్నాడు భగవానుడు గీతలో. ఏ ఋణానుబంధం వుండి నీ దగ్గరకు చేరిందో చేరింది. త్రాహి - అంటే రక్షించమని మూగగా అర్థించింది. ఆమెనీ ఆమె పుట్టుకనీ ఆమె సంస్కృతినీ ఆమె సంప్రదాయాన్నీ రక్షించు. ఆమెని ఆమెగా రక్షించు. అది నీ బాధ్యత'- అన్నారు"

"ఎవరికి పుట్టిందో తెలియని అనాథ అయితే అది వేరే సంగతి. తెలిశాక తెలియనట్లెలా ఉండగలం? ఎలా పెంచగలం?" ప్రశ్నించాను.

"నేనూ అలాగే అడిగాను. ఆయనేమన్నారో తెలుసా? భగవంతుడు నారు వేశాడు. నువ్వు నీరు పొయ్. ఒక మతవిశ్వాసపు నీడలో పెరగాల్సిన బిడ్డని అలాగే పెంచాలి. జన్మత: సిద్ధించిన మత బంధానికి దూరం చెయ్యడానికి నువ్వెవరివి? అంచేతామెని ముస్లిం బిడ్డగానే పెంచు. అదే నీకు నిర్దేశించిన కర్మ. హిందూ సంస్కారం, పరమత సహనం, ఉత్కృష్ట భారతీయ ధర్మం చాటుకునే అవకాశం నీకు లభించింది. శుభమస్తు!"

"మైగాడ్! చెప్పడం తేలికే. చేయడమే కష్టం"

ఆయన వాక్కు వేదాజ్ఞలా భావించాను.

"పాపకి ఫర్జానా అని పేరు పెట్టాను. ముస్లిం మత విశ్వాసాలతో బోధనలతో ఆచారాలతో పెంచాను. రోజూ నమాజు చేస్తుంది. ఉర్దూ స్కూల్లో చదువుకుంది. సేవ చేయాలనే దృక్పథంతోనే నర్సింగ్ కెరీర్ని ఎంచుకుంది. ముస్లిం అబ్బాయితోనే పెళ్లి కుదిర్చాను"

చటుక్కున లేచి నిలబడి "లేవరా" అన్నాను కోపంగా.

"ఎందుకురా?"

"ముందు లే చెబుతా"

లేచాడు. గాఢంగా కావలించుకున్నాను. "నువ్వు మనీషివిరా. నీ ఫ్రెండ్‌నవడం నా అదృష్టం" అన్నాను కళ్ళ నుండి ఆనందభాష్పాలు జలజల రాలిపోతోంటే.

ఆ మర్నాటి నుంచి నేనూ పెళ్లి పనుల్లో పాలు పంచుకున్నాను.

పెళ్లిరోజు రానే వచ్చింది. మాధవ బంధువులూ స్నేహితులూ తరలి వచ్చారు.

అందరం షాదీఖానాకు వెళ్ళాం.

ముస్లింల సాంప్రదాయానుసారం నిఖాకు ఏర్పాట్లు చేశాడు మాధవ. వధువ తరపున హిందువులు, వరుని తరపున ముస్లింలు-అపూర్వ సంగమం! మన సంస్కృతికి అద్దం ! భారతీయాత్మకు ప్రతీక!

'కుబూల్' చెప్పేముందు మాధవని పిలవమంటే పిలిచాను.

"ఏం తల్లీ " ఆదుర్దా పడుతూ వచ్చాడు.

"ఒకసారి నమాజ్ చేస్తాను అబ్బాజాన్"

"చెయ్యి తల్లీ......."

మాధవ వైపు తిరిగి నమాజ్ చేసింది. నా ఆశ్చర్యానికి అవధుల్లేకపోయాయి.

"మక్కా వైపు తిరక్కుండా ఇటు తిరిగావేంటి ఫర్జానా" మాధవ ఆందోళన పడుతూ అడిగాడు.

"మీరే నా మక్కా!" అన్నదామె.

**(ఆంధ్రభూమి దినపత్రిక 7.9.2013)**